# ఆంబోతు

జిల్లా హెడ్‌క్వార్టర్లో అదో ఖరీదైన బంగ్లా. ఆ బంగ్లా పోర్టికో ముందో ఖరీదైనకారు. ఆ కారు వెనుక డోరు తెరిచి నిల్చున్నాడు డ్రైవర్ కారెక్కి కూర్చున్నాడురామ్మోహన్‌రావు. మాజీ జమీందారతను.. ఆ జిల్లాలోని పేరుమోసిన మాజీ భూస్వాముల్లో ఒకడు. అతని శరీరంపై ఖరీదైన బట్టలున్నాయి. వృద్ధాప్యంలోనూ దృఢంగానే ఉన్నాడతను. అతని తర్వాతో మధ్యవయసుగల స్త్రీ కారెక్కి అతని పక్కన కూర్చుంది. ఆమె శరీరంపైనా ఖరీదైన బట్టలే ఉన్నాయి. ఆమె రామ్మోహన్‌రావు కూతురు.

ఆమె పేరైతే సుహాసినీదేవే కాని, ఆమె ముఖంలో చిరునవ్వుకు బదులు చిర్రుబుర్రులుండటం వల్ల ఆ పేరు తప్పిపోయి పెట్టానంటుండేవాడు రామ్మోహన్‌రావు. ఆమె భర్త అమెరికాలో పేరుమోసిన డాక్టర్. గత ఇరవై ఏళ్ళుగా ఆమె అక్కడే ఉంటూంది. సహజంగా అందగత్తెయిన సుహాసినీదేవి చలువదేశంలో ఉండటం వల్ల మరింత తెలుపైంది.

సుహాసినీదేవి కార్లో కూచోగానే ఖరీదైన పట్టుచీర కట్టుకొనున్న ఓ వృద్ధ స్త్రీ కారెక్కింది. దోరసాని ఆమె అంతకుముందే డ్రైవర్ పక్క సీట్లో కూర్చొన్నాడో యువకుడు. అతని పేరు రాంకిషన్‌రావు. సుహాసినీదేవి తమ్ముడతను. వసుంధరాదేవి కారెక్కగానే డోరేసి తన సీట్లో కూర్చున్నాడు డ్రైవర్. డోరేసి రామ్మోహన్‌రావు దిక్కు చూశాడు. అతడుతలూపగానే కారు స్టార్టు చేశాడు.

ఖరీదైన మనుషులను మోస్తున్న ఆ ఖరీదైనకారు బయల్దేరింది. అయితే, ఆ కారు నడుస్తున్న రోడ్డు ఖరీదైంది కాదు. ఆ రోడ్డు నిండా గుంటలే. ఆ గతుకుల రోడ్డు మీద ఆపసోపాలు పడుతూ నడుస్తుందాకారు. ఆ కుదుపుల కిబ్బంది పడ్తోంది సుహాసినీదేవి. ఆమెకళ్ళముందు పాదరసంలా జారిపోయే అమెరికా రోడ్లు కదులుతున్నాయి. అక్కడకార్లో కూర్చొని ప్రయాణం చేస్తుంటేఎంతదూరమైనా అలసట రాదనుకుంది.

'' ఈ రోడ్డు కరీంనగర్ నుంచి ఆదిలాబాద్ జిల్లా ద్వారా మహారాష్ట్రనుకలిపే రోడ్డుకదా! ఇంత అధ్వాన్నంగా ఉందేంటి?'' అంది సుహాసినీదేవి.

ఆ మాటలకు చిన్నగా నవ్వి ఊరుకున్నాడురామ్మోహన్‌రావు''. ''ఇవేమన్నా అమెరికా రోడ్లనుకున్నావా తల్లీ'' అన్నాడు రాంకిషన్‌రావు.

'' ఈ రోడ్డే ఇలా ఉంటే మసూరుకెళ్ళేరోడ్డెలా ఉంటుందిగ.''

''అది మరీ 'కచ్చర్' రోడ్, మనూరు కెళ్ళేసరికి దుబ్బతోని స్నానం చేసినట్ట యితది. అందుకే ఆ పల్లెటూళ్ళల్లో ఏముందమ్మా అంటే వినకపోతివి. పుట్టినూర్ను సూత్తనంటివి. అక్కడేముందో సూత్తువు పా ఇగ'' అన్నాడురామ్మోహన్‌రావు.

''ఇరవైఏళ్ళుగా మీరుంటున్నది కరీంనగర్‌లోనేనాయె. అమెరికా నుంచి నేనెన్నిసార్లొచ్చినా ఊరుకు తీసుకెళ్ళకపోతిరి. ఓసారి ఊరును చూద్దామనుంది'' అంది సుహాసినిదేవి.

సరే. సూత్తవుగదా. ఊళ్లేమ ందో?''

''అక్కా! మీ అమెరిక్ లె మాత్రముండదూరు. అంతా బెగ్గం పాడైపోయింది.''

''సరే'' అని కళ్ళు మూసుకుంది సుహాసినదేవి.

కారు సివిల్‌హాస్పిటల్ దాటి మంచిర్యాల రోడ్డు వెంట పరుగిడుతోంది. కళ్ళు మూసుకున్న సుహాసిని మనసు గతాన్ని నెమరు వేసుకుంటూంది.

'తాను ఎనిమిదవ తరగతి నుంచి పి. యు. సి. వరకు కరీంనగర్‌లోనే చదువు కుంది. చదువుకునే రోజుల్లో ఇదే రోడ్డు మీద తానెన్నోసార్లు ప్రయాణం చేసింది. తాను జీపులోనో, బస్సులోనో వచ్చేది. ముందుచూపున్న తన తండ్రి తన చిన్నతనంలోనే కరీంనగర్‌లో ఇల్లు కట్టాడు. తాను పి. యు. సి. పాసవగానే పెళ్ళయింది. తర్వాత భర్తతో తాను లండన్ పోయింది. అటు తర్వాత అమెరికా వెళ్ళింది. తన ముగ్గురు పిల్లలూ విదేశాల్లోనే పుట్టారు. తన పిల్లలకు 'ఇండియా' అంటే తాజ్ మహల్ అని మాత్రమే తెలుసు.

ఈ పాతికేళ్ళుగా తాను ఇండియాకు చుట్టపుచూపుగానే వచ్చిపోయింది. ఇరవై ఏళ్ళుగా ఊరికెళ్ళడానికి వీలుపళ్ళేదు. తననందరూ చిన్న దొర్సాని, చిన్నదొర్సాని అని పిలిచేవారు. తానిప్పుడూరుకెళ్తే? తనను చూడగానే జనమంతా చుట్టూ మూగుతారు. చిన్న దొర్సాని వచ్చిందంటూ ఉసిళ్ళపుట్టలా జనంచేరుతారు. తననెంతో గౌరవిస్తారు.

కారు కుదుపుకు కళ్ళు తెరిచింది సుహాసినీదేవి. కారులోపలెంత సౌఖ్యంగా ఉన్నా, అది గుంతల్లోకెళ్ళి నప్పుడొచ్చే కుదుపులకామె తట్టుకోలేకపోతోంది. తన పక్కనున్న తల్లి దిక్కు చూసింది.

''అమ్మా! మనింట్లో పనిచేస్తుండేది నర్సమ్మ. బతికుందా'' అంది.

''రొండేండ్ల కిందనేచచ్చిపోయింది.'' అంది వసుంధరాదేవి.

''అయ్యో పాపం! ఏమైందమ్మా నర్సికి?''

''ఏమయ్యేదేంది? ముసల్తనం. మన మా ఊళ్ళో ఉన్నప్పుడు మనింట్ల పని చేసుకుంట బతికేది. మనం వెళ్ళచ్చినంక దానికి కష్టమచ్చింది. కొన్నేండ్లు మనతోనే కరీంనగర్‌లో ఉంది. అటెనుక ఊళ్ళెకు పోయింది. దానికి సర్గిగ కూడే లేకుంటైంది. బెంగటీలింది.''

''దానికిద్దరు కొడుకులున్నారు కదమ్మా''

''మా ఉన్నారుకాని వాళ్ళ బతుకులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఒకడు తాగుబోతు. ఇంకొకడు కొంతవరకు అరుసుకున్నాడు. అయినా, ఆయువు మూడినంక ఎవ్వలేం జేస్తరు?''

''నాన్నా! నర్సి మనింట్లో ఎన్నేండ్లు పని చేసింది?''

''దాని జీవితమంతా మనింట్లోనే గడిచింది. నలువయేండ్లకెక్కోనే పజ్జేసింది. అందుకే దానికింత పొలమిచ్చిన.''

''మరా పొలముందా నాన్నా?.''

''చిన్నోడమ్ముకున్నడని తెల్సింది.''

''అలాగా...'' అని వెనుకకొరిగి కళ్ళు మూసుకుంది సుహాసినీదేవి.

కారు కుదుపులకు తేపకోసారి ముఖం చిట్లిస్తూందామె. ఆమె కళ్ళెదుట తండ్రిగారి 'గడీ' వైభవం కదులుతూంది.

అర ఎకరం పైగా వైశాల్యమున్న స్థలంలో ఐదారు కుంటల స్థలమాక్రమించుకున్న సువిశాలమైన ఇల్లు. ఇంటి చుట్టూ ఖాళీ స్థలం. ఇంటి ముందు సిమెంటు స్తంభాలతో పందిరి. సిమెంటు స్తంభాలను, పైన తీగను అల్లుకుంటూ మల్లెతీగ. అరుగుమీద పుల్లకొర్దీ ధాన్యం పట్టేగుమ్మలు, గరిసెలు, కచ్చేరింట్లో ఆరాం కుర్చీలు.

ఆ కుర్చీలో దర్జాగా మీసాలు మేలేసుకుంటూ కూర్చునేవాడు రామ్మోహన్‌రావు. అతని గంభీరతను చూసి అందరూ జడుసుకునేవారు. 'దొరా' అంటూ కొందరు, 'నీ బాంచెను, నీ కాల్మొక్తా' అంటూ కొందరు దొర దగ్గరి కొచ్చేవారు. వంగి వంగి సలాములు చేసేవారు. ఆతని కనుసన్నల్లో ఎంతో మంది మెదిలేవారు. ఇంటి నిండా దాసదాసీజనాలు, నర్సమ్మలాంటి వాళ్ళే ముగ్గురుండేవారు.

ఇంటికి కొద్ది దూరంలో పశువుల కొట్టం. అందులో ఇర్వై నాగల్ళు కట్టడానికి సరిపోయే ఎడ్లు. నాలుగెడ్లు ఎప్పుడూ 'సవారి బండి' లాగడానికే ఉండేవి. దొర కుటుంబం వారు సవారు బండ్లో ఏ ఊరుకెళ్ళినా బండి ముందుచాకలి పరుగెత్తాల్సిందే. పోట్లగిత్తలాంటి ఆ కోడెలు వాయువేగంతో పరుగెత్తేవి.

విశాలమైన పంట పొలాలు, తోటలు, పెరండ్లు. కనుచూపు మేరకున్న ఆస్తులు. వాట్ని దున్నుతూ దొరగరిసెలు నింపే పాలేర్లు. రామ్మోహన్‌రావు ముందు ఎంతోమంది 'పబ్బతి' పట్టుకొని నిల్చునేవారు. బాకీలు తీసుకెళ్ళేవారు. మకుటం లేని మహారాజులా సాగించుకునేవాడు రామ్మోహన్‌రావు.

సుహాసినీదేవి ఆ ఇంట్లో 'చిన్నదొర్సాని'. ఆమె కోరితే కొండమీది కోతైనా సరే దిగి రావాల్సిందే. ఆమెనుకాలు కింద పెట్టనిచ్చేవాళ్ళు కాదు. ఆమె పనివాళ్ల భుజాల పైన్నే పెరిగింది. వాళ్ళ వీపులను గుర్రాలనుచేస్తూ ఆడుకుంది. వాళ్ళ నెంత హింసించినా, ఆమెను ఎవరూ ఏమనేవారు కాదు. ఎంత పెద్దవాళ్ళనైనా ఆమె రారా, పోరాలతోనే పిలిచేది.

దొర ఇంట్లో ఏదైనా శుభకార్యమైతే ఊరు ఊరుకదిలి రావాల్సిందే. దొర పెద్దలకు బియ్యం ఇచ్చుకునే 'తిథి' రోజున డజనుకు తక్కువ కాకుండా బ్రాహ్మలొచ్చేవారు. నోట్లో కొచ్చేవరకు కడుపు నిండా తిని బ్రేవ్‌లు తీసి బొర్రలను రాసుకుంటూనిద్రపోయేవారు. విస్తర్లో వేసిన నెయ్యి కారుతూ పోయేది. రామ్మోహన్‌రావు ఇల్లెప్పుడూ జనంతో కళకళలాడుతూ ఉండేది ఎంతో వైభవోపేతంగా ఉండేది.

తన తండ్రి వైభవాన్ని జ్ఞాపకం చేసుకుంది సుహాసినీదేవి.

'చాలా ఏళ్ళ తర్వాత తానా ఊరెళ్ళుతోంది. జనం తనెంతో మర్యాదచేస్తారు. కళ్ళకద్దుకుంటారు. తాను అమెరికాలో ఉంటున్నాని మరింతగౌరవిస్తారు.'

కళ్ళు తెరిచింది సుహాసినీదేవి.

''ఏంటమ్మా! బాగా ఆలోచిస్తున్నట్టున్నావు'' అన్నాడు రామ్మోమన్‌రావు.

''ఇంకేముంటుంది నాన్నా! ఊరు గురించే'' అంది సుహాసినీదేవి.

''ఊళ్ళిప్పుడు ఊళ్ళోలె లెవ్వు. మనుషులు మునుపటి తీరుగలేరు.''

ఆ మాటలనేప్పుడు రామ్మోహన్‌రావుకంఠం గద్గదమైంది. నిర్విఘ్నంగా సాగించుకున్న 'అధికారం' కళ్ళముందు కదిలి అతని మనసు భారమైంది.

కాళ్ళు చాపి కళ్ళు మూసుకొన్న అతని కళ్ళముందు తనలాంటి వాళ్ళు ఊళ్ళొదిలి పట్టణాల కెళ్ళాల్సివచ్చిన పరిస్థితులు సినిమా రీళ్లలా తిరుగుతున్నాయి.

---

ఊళ్ళలో చిన్న చిన్నపోరాటాలు ప్రారంభమైనప్పుడే రామ్మోహన్‌రావు లాంటి దొరల అధికారాలకు గండిపడటం ప్రారంభమైంది. పాలేర్ల జీతాలు, కూలిరేట్లు పెంచడం లాంటి విషయాలతో ప్రారంభమైనపోరాటాలు పటుడింతై ఇంతై అన్నట్టు దొరల అధికారాలను ప్రశ్నించడం వరకొచ్చాయి.

సాంస్కృతిక పరంగానూ పోరాటాలారంభమయ్యాయి. దొరా, బాంచెను, కాల్మొక్త అన్నవాళ్ళే నాయకులై ఉద్యమాలు చేశారు. భూ పోరాటాలూ ప్రారంభమయ్యాయి. వెట్టిపనులు బందయ్యాయి. దొరలకు పాలేర్లు బందయ్యారు. భూములు బీళ్ళుపడే పరిస్థితేర్పడింది. చివరకు కొట్టాల్లో ఉన్న పశువులను విడిచిపెట్టేవారే కరవయ్యారు. దొరలు పోలీసుల నాశ్రయించినా ఫలితం శూన్యమే.

ఇక ఊళ్ళు వదిలిపెట్టక తప్పలేదు. రామ్మోహన్‌రావులాంటివాళ్ళకు. మెల్లమెల్లగా ఊళ్ళోని చాలా భూములమ్ముకున్నాడు. తర్వాత భూములు కూడా అమ్మనివ్వకుంటే వాళ్ళతో రాజీ కుదుర్చుకున్నాడు. క్రమక్రమంగా భూములన్నీ అమ్ముకొని జిల్లా హెడ్ క్వార్టర్లో ఆస్తులు పెంచుకున్నాడు. ఒక ఇల్లు మాత్రం మిగిలింది. ఎంత ప్రయత్నించినా దాన్ని అమ్మనీయడం లేదు.

వచ్చిన డబ్బుతో కంట్రాక్టు పట్టాడు. బ్రాందీ షాపు పెట్టాడు. కొంత డబ్బు షేర్లలో పెడుతున్నాడు రామ్మోహన్‌రావు. నిజానికి ఊళ్ళో కంటె కూడా ఇప్పుడే ఎక్కువ సంపాదిస్తున్నాడు. అయినా, ఆ అధికారం, ఆ వైభవం, ఆ పటాటోపం లేకపోవడం రామ్మోహన్‌రావుకెంతో వెలితిగా ఉంది. పట్టణంలో శ్రీరాముడి కోతుల్లో బోడకోతిలా ఉన్నట్టనిపిస్తూందతనికి.

ఎన్నో పంచాయితీలుచేసిన తనను దోషిగా నిలబెట్టిపంచాయతీ చేసిన యువకులు, తాను దండుగల రూపంలో వసూలు చేసిన డబ్బును కక్కించిన గ్రామీణులు జ్ఞాపకం వచ్చి రామ్మోహన్‌రావు ముఖం విచారగ్రస్తమైంది. పూలమ్మిన చోట కట్టెలమ్మాల్సినస్థితి జ్ఞాపకం వచ్చి అతని హృదయం భారమైంది.

తండ్రి ముఖంలోకి చూసిన సుహాసినీదేవి.

''ఏంటి నాన్నా! మీరెలాగో ఉన్నారు'' అంది.

''ఏం లేదు, ఏం లేదు. ఏవో కొన్ని సంగతులు జ్ఞాపకం వచ్చినై. ఊళ్ళు పూర్తిగ పాడైపోయినై'' అన్నాడు రామ్మోహన్‌రావు.

''నిజంగనే నాన్న, ఊళ్ళు పాడైనయి' అన్నాడు రాంకిషన్‌రావు.

కారు పరుగెత్తుతోంది. ఈ రోడ్డు కొంత ఇటీవలే మరమ్మతులు చేసినట్టుంది. ఇప్పుడు కార్లో కుదుపులు లేవు.

దొర కొడుకుగా తన బాల్యం ఎంతో సుఖంగా గడిచింది. తానేదంటే అదే సాగింది. తాను బడికి పోయినా తన ఇంటికే ఉపాధ్యాయులొచ్చి పాఠాలు చెప్పేవారు. తాను వాళ్ళనెప్పుడూ గౌరవించింది లేదు. పాలేర్లపై, కూలినాలి జనంపై తానెంతో సాగించుకున్నాడు. కానీ, వాళ్ళే ఇప్పుడు?

రాంకిషన్‌రావుకూ ఊరు పాడైపోయినట్టే అనిపిస్తోంది.

వసుంధరాదేవి ఆలోచనలు మాత్రం మరోవిధంగా సాగుతున్నాయి.

తాను దొరభార్యగా ఊళ్ళో వైభవోపేతంగానే జీవితం గడిపింది. దొరసానిగా పేదవాళ్ళపై అధికారం చలాయించింది. తనకునుసన్నల్లో పనిచేయడానికెంతో మందుండేవారు. కానీ, ఇంట్లో తనస్థానం? తానున్నా తన భర్తకు ఎంతోమంది స్త్రీలతో సంబంధాలుండేవి. అవన్నీ చూస్తూ తాను నోరు మెదపకూడదు. దొరనుపల్లెత్తు మాటనకూడదు. ఎంతవైభంగా బతికినా, తానెంతో మానసిక క్షోభననుభవించింది. తన మాటకు ఇంట్లో ఉన్న విలువ అంతంతమాత్రమే. తనవాళ్ళందరూ ఊరు పాడయి పోయిందంటున్నారు. నిజానికూరు పాడైపోయిందా? తాను తేల్చిచెప్పే స్థితిలో లేదు.

తల్లి ముఖంలోకి చూసిన సుహాసినీదేవి -

''ఏమిటమ్మా? బాగా ఆలోచిస్తున్నావు'' అంది.

''ఏం లేదు. నాక్కూడా ఊరు యాదికొచ్చింది.''

కారు మెయిన్ రోడ్ దిగి వాళ్ళ ఊరికెళ్ళే రోడ్డు మీది కొచ్చింది. ఆ రోడ్డు డాంబర్ రోడ్డు కాదు. మట్టిరాళ్ళతో వేయబడిన కచ్చర్ రోడ్. రోడ్డు నిండా గుంతలు. ఆ రోడ్డు మీద పరిగెత్తడానికి ఆపసోపాలు పడుతుందా కారు. తండ్రిని మధ్యలోకి రమ్మని తాను చివరకు కూర్చుంది సుహాసినీదేవి. కిటికీ విండో పైఅర్ధం తెరిచింది.

''దుమ్మొస్తది. అది మూసెయ్'' అన్నాడు రామ్మోహన్‌రావు.

''ఫర్వాలేదు నాన్నా. ఉండనీయ్'' అంది.

బయటకు చూస్తూ కూర్చుంది సుహాసినీదేవి.

పల్లిచేలు, పెసరు చేలు. మొక్కజొన్నచేల మధ్య నుంచి పరిగెత్తుతుందా కారు. చల్లటిగాలితోపాటు కొంత దుమ్మూ వస్తోంది. అయినా, సుహాసినీదేవి కిటికీ మూయడం లేదు.

అంతకుముందు ఊరికా రోడ్డుండేది కాదు. సవారెడ్లబండిలో మెయిన్ రోడ్ వరకొచ్చి బస్సెక్కేది సుహాసినీదేవి. చిన్ననాటి విషయాలను జ్ఞాపకం చేసుకుందామె.

ఉదయం పదిగంటలు దాటింది. చేలో పని చేయడానికి జనాలొస్తున్నారు. ఆ శ్రామిక స్త్రీలలో కొందరు పాటలు పాడుతున్నారు. కారును నెమ్మదిగా పోనివ్వమంది సుహాసినీదేవి. ఆ స్త్రీలు పాడుతున్న పాటల్లో కొన్ని జానపదగేయాలు, సంప్రదాయ పాటలున్నా మరికొన్ని కొత్తపాటలుండటం గమనించిందామె.

అవి సరిగ్గా వినరాకున్నా, ఈ పాటల్లో ఏదో మార్పున్నట్టనిపిస్తోందామెకు.

వాళ్ళను చూస్తూ రిస్టువాచీ దిక్కు చూసిన సుహాసినీదేవికి తాను బాల్యంలో చూసిన కూలీల సంగతి జ్ఞాపకం వచ్చింది. తనచిన్నతనంలో కొంచెం పొద్దెకం తర్వాతపొలం పనులకెళ్ళిన స్త్రీలు, పురుషులు పొద్దుగూట్లో పడేంతవరకు పనులు చేస్తూనే ఉండేవారు. ఇంతసమయమైనా ఇప్పుడూ కూలీలు రావడం చూసి అదే విషయం తండ్రి నడిగింది.

''ఆ కాలమెప్పుడో పోయిందమ్మా! ఇప్పుడు వాళ్ళను మందలించ వశం గాదు. మునుపటోలె బారెడు పొద్దెక్కంగనే పనికి పోయి రాత్రయేదాకెవ్వలుంటలేరు. చేండ్లకు వచ్చేసరికే పదకొండుగంటలయితది. మళ్ళీ నాలుగ్గంటలుకాగానేపోవుటానికి తయారైతరు. వాళ్లనేమసేట్టు లేదు.

ఏమన్నంటె అన్నలు'' అన్నాడు రామ్మోహన్‌రావు.

ఆ మాటలు విని ఆశ్చర్యపోయింది సుహాసినీదేవి.

''ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకయినా ఎనిమిది గంటల డ్యూటీ ఉంటుంది కద నాన్నా! మరి నీళ్ళు చేస్తున్న పనిగంటలెన్ని?''

''అయితే, ఫ్యాక్టరీల్లో ఇచ్చే జీతాలియ్యమంటారు. కూలిరేట్లైతే పెంచుకున్నారుకాని పనిగంటల సంగతి వాళ్ళుమాట్లాడనియ్యరు. అంతా వాళ్ళదే సాగుతుంది.''

కారు గుంటల్లో పడుతూ లేస్తూ నడుస్తూంది.

మనం కరీంనగర్‌కెళ్ళేసరికి నీ కారు పని మటాష్''

''అయితే, అవుతుందిలే' అంది సుహాసినీదేవి.

కారు ఊరు పొలిమేరల్లోకి ప్రవేశించింది. పంటపొలాలను, బీడు భూములను చూస్తూ కూర్చుందామె. ఇంతకు ముందున్న మోట బావులకు, రాటు బావులకు కరెంటు మోటార్లు, ఇంజన్లు రావడం గమనించింది. కొంత దూరంలో ఉన్న కాలువను చూపెడుతూ,'' అది పోచంపాడు కెనాల్ కాలువ కద నాన్నా!'' అంది.

''అవునమ్మా! ఇది శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలువ. మనమూళ్ళో ఉన్నప్పుడుకాలువలు తవ్వకంలో ఉండేవి. పని పూర్తయి దాదాపు పదిహేనేండ్ల నుంచి నీళ్ళు వస్తున్నయి. ఈ కాలువలు వచ్చిన తర్వాత మన ప్రాంతంలో వ్యవసాయాలు కొంత మెరుగైనయి. ఓ పంట పోయినా, ఇంకో పంటయినా పండుతుంది. అంతకుముందు వర్షాలు [illegible]డి చెరువులు నిండితే పండినట్టు, లేకుంటే లేదు.''

తండ్రి మాటలు విని తలూపింది సుహాసినీ దేవి.

కారు ఊరు వెలుపలున్న బస్టాపు దగ్గర కొచ్చింది. అక్కడ రెండు గుడిసె హోటళ్ళున్నాయి. మూ[illegible] పార్టీల జండా గద్దెలన్నాయి. వివిధ రాజకీయ పార్టీల - ముఖ్యంగా విప్లవ కమ్యూనిస్టు [illegible] స్లోగన్లు గోడల నిండా ఉండటం గమనించింది సుహాసినీదేవి. తను ఊహించని ఎన్నో ఎ[illegible]మూలాలను గమనిస్తున్నా తన పుట్టినూరుకు వచ్చిన తన్మయత్వంతో ఆమె ఒళ్ళు పులకరించింది. మరికొద్ది నిమిషాల్లో కారు రామ్మోహన్‌రావు ఇంటిముందాగింది. డ్రైవరు కారు దిగి డోర్లు తెరిచాడు. వాళ్ళంతా కారు దిగి నిల్చున్నారు.

ఇంటి దిక్కు చూసిన సుహాసినీదేవి ముఖం చిన్నబోయింది. రాజభవనంలా, గంభీరంగా కనబడాల్సిన దొరగాలి ఇల్లు కళావిహీనమై, బోసిపోయినట్టగుపడిందామెకు. ఎంతో సందడిగా, హడావిడిగా ఉండే ఆ ఇల్లు దిక్కులేని వారిల్లులా కనబడటం ఆమెకు బాధ కల్గించింది. పెచ్చులూడిపోతున్న గోడలు, ఇంతెత్తు చెత్తా చెదారంతో ఉన్న వాకిలి చూసిన సుహాసినీదేవి హృదయంలో చేయి పెట్టి కెలికినట్టయింది.

ఆ ఇంటిముందు పదిహేనేళ్ళ కుర్రాడు తనకు తానొక్కడే చిర్రగోనాడుతున్నాడు. వాళ్ళను చూసి ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా చిర్రగోనె చేతిలో పట్టుకొని నిల్చున్నాడు.

నలుగురూ పెద్దరువాజ దాటి లోపలికి కెళ్ళారు. దొర ఇంటి పక్కనున్న రైతు ఓ మంచం తెచ్చి వాకిట్లో వాల్చాడు. ఆ మంచంలో కూర్చున్నారు వాళ్ళు. ఆ కుర్రాడు మాత్రం అలాగే నిల్చున్నాడు.

''వీడెవడమ్మా?'' అడిగిందా బాబును గూర్చి సుహాసినీదేవి.

''మనకు పాకలేరుండేవాడు చూడు లసుమయ్య. ఆ లసుమయ్య మనుమడు'' అంది వసుంధరాదేవి.

నలభై ఏళ్ళకు పైగా పాలేరుండి, జీవితాన్నంతా తమ కుటుంబం సేవలోనే గడిపిన లసుమయ్యను జ్ఞాపకం చేసుకుంది సుహాసినీదేవి. ఎంతో వినయ విధేయతలతో సేవ చేసిన లసుమయ్యకు నిర్లక్ష్యం, పొగరుగా కనబడ్తున్న ఆ కుర్రాడికి గల అంతరాన్ని బేరీజు వేస్తోందామె.

తాము రాగానే ఎంతోమంది చుట్టూ మూగుతారని, ఊపిరి సలుపని ప్రశ్నలతో చేరుతారని ఊహించిన సుహాసినీదేవికి ఆశాభంగంగానే ఉంది. తేవకొకరు రైతులు, చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు వచ్చి రామ్మోహన్‌రావును పలుకరించి పోతున్నారు. వాళ్ళ పలుకరింపుల్లోనూ మునుపటి ఆప్యాయత కనబడలేదామెకు. ఏదో మొక్కుబడి కన్నట్టుగా ఉన్న ఆ పలుకరింపులను చూసి బాధపడ్తోందామె. తన తండ్రి ఇంతకుముందులా రైతులను 'రారా', పోరా' అనికాకుండా మర్యాదగా పిలవడం గమనించిందామె.

తేపకొకరుగా ఆడవాళ్ళొచ్చి వసుంధరాదేవితో మాట్లాడిపోతున్నారు. కొందరు సుహాసినీదేవిని గురించి అడుగుతున్నారు. అంత ఊర్లో తమ రాకనెవరూ పెద్దగా పట్టించుకోకపోవడం ఆమెకు ఆశ్చర్యంగా ఉంది. రామ్మోహన్‌రావు పూర్వ స్నేహితులైన వృద్ధులుకొందరు వచ్చి మాట్లాడి పోతున్నారు. యువకులెవరూ అటు రావడం లేదు.

కొద్దిసేపాగి లేచి ఇంటి వెనుక భాగమంతా తిరిగి చూశారు. ఇల్లంతా చూశారు. ఆ ఇంట్లో ఉండేవాళ్ళు లేక శిథిలమవుతున్న ఆ ఇంటినిచూస్తున్న వాళ్ళకు హృదయం భారమైంది. బావి దగ్గరికెళ్ళికాళ్ళు, చేతులుకడుక్కొచ్చుకొని మంచంలో కూర్చున్నారు.

'అరే నర్సిమ్మా! రంగారావు దొరను తీసుకురా పో'' అన్నాడు కుర్రాడితో రామ్మోహన్‌రావు.

అతని దిక్కు నిర్లక్ష్యంగా చూశాడాకుర్రాడు. పొగరుగా తలనెగురేశాడు. 'దొర' అనే మాట అతనికి నచ్చినట్టు లేదు.

''తీసుకత్త'' అని బయటికెళ్ళాడు.

''ఈ ఇల్లొక్కటే మిగిలిందిక్కడ మనకు. ఈ పిల్లవాడు దీన్ని కనిపెట్టుకొనుంటున్నాడు. వీడూ ఉండేవాడు కాదు. కానీ, మునుపటి మర్యాదతో తాత మాటను కాదనలేక ఉంటున్నడు. వీని తాత ఆర్నెల్లి కిందనే చనిపోయిండని తెలిసింది. ఈ ఇల్లును అమ్ముదామంటే అమ్మనివ్వడం లేదు. రెండు మూడు సార్లు ఇంటిపై జెండాలు పాతితేపోలీసులు తీసేశారు'' అన్నాడు రామ్మోహన్‌రావు.

తలూపింది సుహాసినీ దేవి.

ఊరివాళ్ళు కొద్దిమందొచ్చి రామ్మోహన్‌రావుతో మాట్లాడిపోతున్నారు. అయితే, కూలి నాలి చేసుకొనే వాళ్ళు కూడా వంగి వంగి దండాలు పెట్టడం లేదు. నీ బాంచెను, నీ కాల్మొక్తా, గులాపోన్ని అనడం లేదు. అన్నీ గమనిస్తూంది సుహాసినీదేవి.

ఇంతలో రంగారావును వెంటబెట్టుకొచ్చాడు నర్సింహ.

''అన్నయ్యా! ఇక్కడే ముందని ఇక్కడికొచ్చారు? మీరు చక్కగా మా ఇంటికే రావాల్సింది. వచ్చి ఎంత సేపైంది'' అన్నాడు అక్కడికొస్తూనే రంగారావు. అతడు రామ్మోహన్‌రావుకు 'పాలివాడు' పెద్దగా ఆస్తిపాస్తుల్లేవతనికి.

''గంటసేపైంది మేమొచ్చి. ఇల్లునోసారి చూద్దామనిక్కడికచ్చినం. ఊర్ను చూద్దామని అమ్మాయంటే రావాల్సచ్చింది.''

''అనగ్మాయెప్పుడచ్చిందమెరికానుంచి?'' రామ్మోహన్‌రావు పక్కనకూర్చుంటూ అన్నాడు రంగారావు.

''నాలుగు రోజులైంది వచ్చి. వచ్చినుంచి ఇక్కడికొద్దామనే అంటుంది. ఇక రాక తప్పలేదు.''

అందరినీ ఆప్యాయంగా పలుకరించాడు రంగారావు. కొద్దిసేపు ఊరి విషయాలు మాట్లాడుకున్నారు. మధ్య, మధ్య ఎవరెవరో వచ్చి పోతున్నారు. కొందరు రైతులు అక్కడే కూర్చునున్నారు.

''మా ఇంటికి పోదాం పద అన్నయ్యా! భోజనాలవీ అక్కడే చెయ్యొచ్చులెండి.''

''ఫ్లాస్కులో తెచ్చిన టీ తాగినం. కరీంనగర్‌లోనె టిపినవీ ముగించినం, నువ్వెళ్ళు. భోజనం తయారు చేయించు. కొంచెంసేపాగి మేమొస్తం'' అనాడురామ్మోహన్‌రావు.

నరేనని ''రామప్పగుడి దగ్గరి కెళ్దామా?''

''భోజనాలైన తర్వాత పోదాం. అంతసేపు వచ్చేవాళ్ళతో మాట్లాడుకుంటుందాం.''

కొందరొచ్చి మాట్లాడిపోతున్నా, సుహాసినీదేవి ఊహించినట్టు జరగడం లేదు. వచ్చినవాళ్ళలో కొందరెంతో ఆప్యాయంగా మాట్లాడినా, చాలామంది మాటల్లో కృత్రిమత్వాన్ని గమనిస్తోందామె. మునుపట్లా తమలాంటి వాళ్ళను లక్ష్యపెట్టక పోవడం చూస్తోంది. 'తన తండ్రిలాంటి వాళ్ళ కూళ్ళలో స్థానం లేదా?' తనను తాను ప్రశ్నించుకుంటూంది.

''వంటయింది. భోజనానికి రమ్మంటున్నాడు రంగారావుదొర'' అంటూ ఓ మనిషొచ్చాడు. అంతా లేచి రంగారావింటికి వెళ్ళారు. రంగారావు భార్య, పిల్లలు రామ్మోహన్‌రావు కుటుంబం వాళ్ళను సాదరంగా ఆహ్వానించారు. ఆప్యాయంగా పలుకరించారు. గౌరవంగా చూశారు. భోజనం చేస్తూ పాత విషయాలను జ్ఞాపకం చేసుకున్నారు. జీవితాన్ని మననం చేసుకున్నారు. గత వైభవం గూర్చి మాట్లాడుకున్నారు. చివరగా-

''ఊళ్ళన్నీపాడైపోయినయి. ఒకరి మర్యాదొకరికి లేకుంటైంది. పెద్ద చిన్నతురం లేకుంటపోయింది'' అన్నాడు రామ్మోహన్‌రావు.

దూరంగా కూచొని వాళ్ళమాటలు వింటున్న నర్సింహ ''ఎవరికి పాడైపోయిన యూళ్లు. మీకా, మాలసోంటోల్లకా? మీది సాగకుంటె పాడైపోయినట్టు. గంతేగదు'' అన్నాడు.

ఆ మాటలకందరూ నోళ్ళు తెరిచారు. ఆ కుర్రాడి నుంచి అంత లోతైన మాటలూహించని సుహాసినీదేవికి మరింత ఆశ్చర్యం కలిగింది. నర్సింహను వాళ్ళేమన్లేదు. భోజనాలు ముగించి కచ్చేరింట్లో వాల్చిన మంచాల్లో కూర్చున్నాడు.

కొద్దిసేపాగి గుడికి పోతామన్నారు.

''బండి కట్టియ్యమంటారా అన్నయ్యా'' అన్నాడురంగారావు.

''గుడుంది ఊరు బయట్నే ఏమంత దూరముంది. నడుచుకుంటూ పోదాం ఊర్ను చూసినట్టుంటుటంది'' అంది సుహాసినీదేవి.

''నువ్వు నడువగలవా తల్లీ'' అంది వసుంధరాదేవి.

''ఎందుకు నడువనమ్మా. నడుస్తాను.''

ఆ నలుగురితోపాటు రంగారావు, నర్సింహ బయలుదేరారు. దొర ఊళ్ళో కెళితే చుట్టూ జనంతో

ఎంతో అట్టహాసంగా ఉండేదొకప్పుడు. ఇప్పుడెవరూ అంతగా లక్ష్యపెట్టకపోవడం గమనించింది సుహాసినీదేవి. కొన్ని ఇళ్ళకు తాళాలుండటం, పాడుబడిన ఇండ్లకు తాళాలున్నాయి?

''ఏంటి నాన్నా! చాలా ఇండ్లకు తాళాలున్నాయి?''

కూతురు ప్రశ్నతో రామ్మోహన్‌రావుముఖంచిన్నబోయింది. ఏవేవో జ్ఞాపకాలు కదిలాయి. కొద్ది క్షణాలాగి-

''కొందరేమొ మనలా ఊళ్ళొదిలి వెళ్ళిపోయారు. కొందరేమొ బతుకుతెరువు లేక పట్నాలకు వలసపోయారు. కొందరు ఉద్యోగాలు దొరికతేవెళ్ళిపోయారు. వేములవాళ్ళు నీకు తెలుసు కద. రెం కుటుంబాలు కలిసి ఎనిమిది. సంసారాలు, అందులో ఒక్కడు మాత్రమే ఊళ్ళో ఉంటున్నాడు. కొన్నిళ్ళలో ముసలివాళ్ళు మాత్రమే ఉంటున్నారు'' అన్నాడు రామ్మోహన్‌రావు.

అవునన్నట్టు తలూపింది సుహాసినీదేవి. రామ్మోహన్‌రావును, వసుంధరా దేవిని కొందరు పలుకరిస్తున్నారు.

మాట్లాడుతూ, మాట్లాడుతూ గుడి చేరుకున్నారు. రామప్పస్వామిని చూస్తున్న సుహాసినీదేవికి దేవుడు కూడా పూర్వవైభవాన్ని కోల్పోయినట్టనిపించింది. మునుపు గుళ్ళో పూజలు జరుగుతున్నట్టుగా ప్రస్తుతం జరగడం లేదనిపిస్తూందామెకు. ప్రతి శనివారం, శ్రావణ మాసంలో ప్రతిరోజూ, శివరాత్రి రోజునరోజంతా గుళ్ళో భజనలనీ జరిగేవి. ఇప్పుడవి జరుగుతున్న సూచనలు కనపడలేదామెకు. దేవుని దిక్కు, తండ్రి దిక్కు చూసింది సుహాసినీదేవి. దేవుడి పరిస్థితీ తన తండ్రి పరిస్థితిలాగే ఉన్నట్టనిపించాదమెకు.

''అక్కా! ఇప్పుడు భక్తి పూజలు పట్టణాలకు దిగుమతయ్యాయి. పల్లెల్లో తగ్గాయి. దేవుడికి పట్నాల్లోనే వెళ్ళుబాటుగా ఉందిప్పుడు'' అన్నాడు రాంకిషన్‌రావు. ''అవును ఈ మాట నిజమే'' అన్నాడు రంగారావు.

''మీ అసొంటోల్లంత పట్నాలకు పోయిండ్రు గద మరి'' అన్న నర్సింహ మాటలతో అంతా ఉలిక్కిపడ్డారు.

మనిషికో కొబ్బరికాయ కొట్టారు. దేవుడికి నమస్కరించారు. 'నంది'పై ఉన్న బొట్టు తీసుకొని నొసటికి పెట్టుకున్నారు. గంట మోగించారు. గుడి బయట కూచొని కొబ్బరి చిప్పలు పగులకొట్టి తిన్నారు. అక్కడే కొద్దిసేపు మాట్లాడుకున్నారు. లేచి రంగారావింటికెళ్ళారు.

మంచాల్లో నడుం వాల్చారు.

కళ్ళు మూసుకున్న సుహాసినీదేవికి ఇప్పటి ఊరుకు, తాను చూసిన ఊరుకు ఉన్న తేడా కళ్ళముందు కదుల్తోంది. గడీలు, దేవిడీలు, తన తండ్రిలాంటి వాళ్ళ వైభవం పతనమవడం ఆమె కళ్ళముందు తిరుగుతూంది. ఖచ్చితంగా కులాల వారీగా వృత్తులు నశించినా, ఇంకాకొన్ని కులవృత్తులుండటం గమనించిందామె. ఆలోచిస్తూ నిద్రలో కొరిగింది.

రంగారావు భార్య టిఫిన్‌సిద్ధం చేసి అందర్నీ లేవమంది. అంతా లేచి ముఖాలు కడుక్కొని టిఫిన్లు ముగించారు. రామ్మోహన్‌రావు, రంగారావుతో మాట్లాడుతున్నాడు. సాయంత్రం అయిదు గంటల సమయం కావస్తూంది.

రామ్మోహన్‌రావుకు ఆపదకాలంలోనూ అతి సన్నిహితంగా ఉండే తెనుగు ఊసాలు వచ్చాడు. అతన్నింకా 'దొరా' అని పిలిచే అతికొద్ది మందిలో పోషాలొకడు. అతడక్కడికి వస్తూనే-

''దొరా! పొద్దుగూకుతుంది. రాత్రికి మీరిక్కడుండడం మంచిదిగాదు. పడుసు పోరగాండ్లతోని—

మాట్లాడుకుంటం(డు. అన్నలకు తెలిస్తేకష్టం. రా(త్రి కాకముందే వెళ్ళిపోం(డి' అన్నాడు.

ఆ మాటలు విని అంతా లేచి నిల్చున్నారు. అందరి ముఖాల్లో భయం.

''అన్నయ్యా! నేనూ ఊసేలన్నదే అనుకుంటున్నాను. నానోటితో నేను చెప్పడమెలాగని జంకుతున్నాను'' అన్నాడు రంగారావు.

ఆ రా(త్రి అక్కడే ఉందామనుకున్న వాళ్ళకు ఊసాలు, రంగారావు మాటలు ఆశాభంగం కలిగించాయి. అందరి ముఖాలూ మాడిపోయాయి.

కొద్ది నిమిషాల్లోనే అందరికీ వీడ్కోలు చెప్పి, గబగబా కారెక్కారు. డ్రైవర్ కారు స్టార్టు చేశాడు. అయిదు నిమిషాల్లో కారు ఊరు దాటింది. రోడ్డు బయటకు చూసిన సుహాసినీదేవి కారునాపమంది. కారాపాడు డ్రైవర్.

రోడ్డు పక్కన ఓ ఎద్దు పడుంది. ఏనుగులా పెద్ద శరీరంతో ఉన్న ఆ ఎద్దు కాళ్ళు నిర్రదన్ని చచ్చిపడుంది. దాని శరీరాన్ని రాబందులుపీక్కు తింటున్నాయి. నెత్తురోడుతున్న ఆ శరీరం జుగుప్సాకరంగా ఉంది. దాన్ని చూపుతూ సుహాసినీదేవి ''అది మన ఇత్తనపు కోడె ఆంబోతు కదా నాన్న'' అంది. ''మన ఆంబోతు ఇన్నేడ్లుంటదా తల్లీ! మేమూరొదిలి వచ్చిన యాడాదికే చచ్చిపోయింది. ఇదీ మన ఆంబోతు లాంటిదే. లక్ష్మణరావు మామది. ఆయన రెండేండ్ల కింద ఊరిడిసి వెళ్ళిపోయిండు. హైద్రాబాద్‌లో ఉంటున్నడు'' అన్నాడు రామ్మోహన్‌రావు.

''అలాగా'' అని కారును పోనియ్యమంది సుహాసినీదేవి.

కారు నడుస్తోం.

ఎవరి చేలోనైనా పడి తన ఇష్టమున్నది తింటూ, ఎవరి మందలోనైనా విచ్చలవిడిగా తిరుగుతూ, లడ్డూ అదుపూ లేకుండా బతికిన తమ 'ఆంబోతు' జ్ఞాపకం వచ్చింది సుహాసినీదేవికి.

కారు 'కచ్చర్ రోడ్' దాటి మెయిన్ రోడ్డుపైకొచ్చింది. కార్లో ఉన్నవాళ్ళ ముఖాల్లో భయం తగ్గింది.

కారు కరీంనగర్ దిక్కు పరుగెత్తూతుంది. బాగా ఆలోచిస్తున్న సుహాసినీదేవికి చచ్చిపడున్న ఆంబోతుకూ, తన తం(డిలాంటివాళ్ళకూ దగ్గరి పోలిక లున్నట్టు కనిపిస్తూంది.

'అంటే, అంటే? తన తం(డిలాంటివాళ్ళు... వాళ్ళను కాపాడే వ్యవస్థ... ఆ ఆంబోతులా...?'

ఇక ఆలోచించలేకపోయింది సుహాసినీదేవి.

గట్టిగా కళ్ళు మూసుకుంది.

కారు కరీంనగర్ దిక్కు పరుగెత్తుతూనే ఉంది.

**ఇండియాటుడే పక్షప(త్రిక అక్టోబర్ 21, నవంబర్ 5 '94**

**కేం(ద సాహిత్య అకాడమి స్వర్ణోత్సవ కథాసంకలనం (బంగారుకథలు) నుంచి**